వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



సమావేశంలో సూచనలిస్తున్న ఎంఈఓ వసంతకుమారి

మేడ్చల్: మండలంలోని అన్ని గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు మరింత శ్రమించాలని ఎంఈఓ వసంతకుమారి అన్నారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. అన్ని పాఠశాలల్లో 10వ తరగతిలో ఉత్తీర్ణత వంద శాతం ఉండాలన్నారు. కేవలం ఉత్తీర్ణత లక్ష్యంగా కాకుండా వ్యక్తిగత శ్రద్ధ పెట్టి వారు ఏ సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నారో వాటిలో తర్ఫీదు ఇవ్వాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను దత్తత తీసుకుని వారు మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని అన్నారు. సమావేశంలో మండల జిల్లా పరిషత్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీ సెంటర్ నిర్మాణానికి రూ.1.43 కోట్ల నిధులు



రఘునాథ్‌స్వామితో నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీలో యూపీహెచ్‌సీ సెంటర్ నిర్మాణం కోసం రూ.1.43 కోట్ల నిధులు మంజూరయ్యాయని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఆఫీస్‌లో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి రఘునాథ్ స్వామిని కలిసి నాగారంలో యూపీహెచ్‌సీ సెంటర్ నిర్మాణం కోసం నిధుల మంజూరు విషయాన్ని తెలియజేశారు.

బీసీ సెల్ మున్సిపల్ అధ్యక్షుడిగా మురళీగౌడ్



ఘట్‌కేసర్: బీఆర్‌ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం పలువురికి నియామక పత్రాలు అందజేశారు. బీసీ సెల్ మున్సిపాలిటీ అధ్యక్షుడిగా సార మురళీగౌడ్, 18వ వార్డు బీఆర్‌ఎస్ అధ్యక్షుడిగా సతీశ్, 15వ వార్డు అధ్యక్షుడిగా సార అరవింద్‌గౌడ్, 11వ వార్డు అధ్యక్షుడిగా శ్రీనివాస్, బీసీసెల్ ప్రధాన కార్యదర్శిగా కుమార్‌ను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎఫ్‌ఎస్‌సీఎస్ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, నగేశ్, పోచయ్యముదిరాజ్, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శిగా రాజశేఖర్



నియామకపత్రాన్ని అందజేస్తున్న సమితి రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ సహేరా భాను

పోచారం: జాతీయ వినియోగదారులు, మానవ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అన్నోజిగూడకు చెందిన కౌన్సిలర్ చింతల రాజశేఖర్ నియమితులయ్యారు. ఈమేరకు నియామక పత్రాన్ని సమితి రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ సహేరా భాను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పదవీ బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఏడాది పాటు తాను ఈ పదవిలో కొనసాగనున్నట్లు చెప్పారు.

‘అనురాగ్’లో లీడర్‌షిప్ ఎక్స్‌లెన్స్ సెమినార్



ఘట్‌కేసర్: అనురాగ్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ విద్యార్థుల నాయకత్వ లక్షణాలను గుర్తించడానికి శుక్రవారం ‘లీడర్‌షిప్ ఎక్స్‌లెన్స్ ఇన్ ఇన్వెస్టిచర్’ సెమినార్ నిర్వహించారు. డీన్ విజయ్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి సెమినార్‌ను ప్రారంభించారు. అనంతరం సెమినార్‌లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ విష్ణుమూర్తి, ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాచారం డివిజన్ అధ్యక్షుడిగా శ్రీకాంత్‌గౌడ్



మల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ నాచారం డివిజన్ అధ్యక్షుడిగా బండారం శ్రీకాంత్ గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. త్వరలో రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేతలు కృష్ణారెడ్డి, రాంరెడ్డి, సత్తయ్య యాదవ్, బండారి రఘు, భద్రయ్య, వెంకట్, రాజు, మహేష్ యాదవ్, టోని ఫ్రాన్సిస్, నరేష్, గద్ద క్రాంతి తదితరులున్నారు.

బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

అల్వాల్: మల్కాజిగిరి లక్ష్మీసాయి గార్డెన్స్‌లో ఈ నెల 4వ తేదీన నిర్వహించే బీఆర్‌ఎస్ పార్టీ కుటుంబసభ్యుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు, ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా పార్టీ అధ్యక్షులు శంభీపూర్ రాజులు హాజరు కానున్నారన్నారు. వివరాలకు 9133999507, 9154959932 నెంబర్లకు ఫోన్ చేయవచ్చు.

సర్కారు దవాఖానాకు సుస్తీ

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేరుకుపోయిన సమస్యలు
- మేడ్చల్, శామీర్‌పేట్‌లో సీహెచ్‌సీలుగా.. అప్‌గ్రేడ్ అయినా వసతులు శూన్యం
- ఆస్పత్రుల్లో ఖాళీలతో పలువురిపై అదనపు భారం
- సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు, పల్లె ఆస్పత్రుల్లో కొరత
- వేళకు రాని డాక్టర్లు, సిబ్బందితో రోగులకు కష్టాలు



సాక్షి, మేడ్చల్‌జిల్లా: గ్రామీణ, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆస్పత్రులతో సహా పలు పల్లె, బస్తీ దవాఖానాల్లో డాక్టర్లు, సబ్ స్టాఫ్ కొరత, నిర్వహణ, పారిశుద్ధ్యం సరిగ్గా లేకపోవడంతో రోగులకు శాపంగా మారుతోంది. రోగులకు సకాలంలో వైద్యం అందితేనే కోలుకుంటారు. వైద్య సేవలు అందాలంటే ఆస్పత్రుల్లో సరిపడా సిబ్బంది ఉండాలి. కానీ జిల్లాలోని పలు పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో వైద్యులు, సిబ్బంది కొరత ఉంది. మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాలో మల్కాజిగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రితో సహా ఘట్‌కేసర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందుతున్నాయి. అలాగే, 26 ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 12 గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, 70 పల్లె దవాఖానాలు, 112 బస్తీ దవాఖానాలు స్థానిక ప్రజలకు అరకొర వైద్య సేవలు అందుతున్నాయి. ఐదు నెలల క్రితం మేడ్చల్, శామీర్‌పేట ఆస్పత్రులను కమ్యూనిటీ హెల్త్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేసినా.. ఇప్పటి వరకు సరిపడా వసతులు, వైద్యులు, సిబ్బందిని నియమించలేదు.

కొరత.. కలత..

జిల్లాలో పెరిగిన జనాభా, కాలనీలకు అనుగుణంగా ఆస్పత్రుల్లో మంజూరు పోస్టులను కూడా భర్తీ చేయకపోవడంతో ప్రస్తుతం పనిచేస్తున్న డాక్టర్లు, వైద్యాధికారులు, సిబ్బందిపై అదనపు భారం పడుతోంది. సర్కారు దవాఖానాల్లో ఖాళీగా ఉన్న 35 మంది డాక్టరు పోస్టులతో సహా 113 పారా మెడికల్, 32 ల్యాబ్ టెక్నీషియన్లు, 109 సబ్ స్టాఫ్, 100 నర్సుల పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. జిల్లాలో 3,000 మంది ఆశ వర్కర్స్ పని చేయాల్సి ఉండగా, 340 మంది మాత్రమే ఉన్నారు. అలాగే, అప్‌గ్రేడ్ చేసిన మేడ్చల్, శామీర్‌పేట సీహెచ్‌సీల్లో 20 మంది వైద్యులు, 24 మంది స్టాఫ్ నర్సులు, 10 మంది పారామెడికల్ సిబ్బందిని నియమించాల్సి ఉంది. కొత్త ప్రభుత్వం ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఖాళీ పోస్టుల భర్తీపై దృష్టి సారించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

సమయ పాలనపై.. నిర్లక్ష్యం

జిల్లాలోని పలు గ్రామీణ, అర్బన్ ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో సమయానికి రాని డాక్టర్లు, సిబ్బందితో రోగులు వైద్య పరీక్షలు, సేవల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంటోంది. సాధారణ జబ్బులు, జ్వరం, దగ్గు, ఒళ్లు నొప్పులకు సంబంధించిన మందులు అడపాదడపా లభించినా సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందులు దొరక్క రోగులకు ఇబ్బందులు పడుతున్నారు.

రౌండ్ ది క్లాక్ ఆస్పత్రుల్లో..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 24 గంటలు (రౌండ్ ది క్లాక్) ఆస్పత్రులు 12 ఉండగా, ఇందులో నాలుగు ఆస్పత్రుల్లో డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో లేకపోవడం, మరి కొన్నింటిలో ఆలస్యంగా రావడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రులకు వచ్చిన రోగులకు అవసరమైన మందులు లేకపోవడంతో రోగాలు నయం కావడం లేదని ఆందోళన చెందుతున్నారు.

పని తీరూ.. అంతంతే..

ప్రభుత్వ ఆస్పత్రుల్లో కొందరి డాక్టర్లు, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల రోగులకు వైద్యం అందడం లేదని తెలుస్తోంది. మేడ్చల్, ఘట్‌కేసర్ ఆస్పత్రిలో డాక్టర్లు, సిబ్బంది సమయానికి రాకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల్లో సహా పల్లె, బస్తీ దవాఖానాల్లో కూడా వేళకు రాని వైద్యులు, సిబ్బందితో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు 12 ఉండగా, ఇందులో 11 కేంద్రాల్లో ప్రసవాలు చేస్తున్నప్పటికీ, డాక్టర్లు అందుబాటులో లేని కారణంగా గర్భిణులు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అలాగే, 26 పట్టణ ఆరోగ్య కేంద్రాలుగా, ఇందులో ఆరింటిలో ప్రసవాలు చేస్తున్నామని, జిల్లా వైద్యారోగ్యశాఖ పేర్కొంటున్నప్పటికీ, ఆచరణలో అమలుకు నోచుకోవడం లేదని తెలుస్తోంది. ఈ ఆస్పత్రుల్లో మిగతా సేవలు కూడా అంతంత మాత్రంగా అందుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లా వైద్యారోగ్యశాఖ పర్యవేక్షణ సరిగ్గా లేకపోవడంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు వైద్యసేవలు పూర్తి స్థాయిలో అందడం లేదన్న విమర్శలు ఉన్నాయి. జిల్లా అధికార యంత్రాంగం, కలెక్టర్ వెంటనే స్పందించి ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

జన్మదిన శుభాకాంక్షలు



బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని 3వ డివిజన్ కార్పొరేటర్ కొత్త చందర్‌గౌడ్ పుట్టిన రోజును పురస్కరించుకుని బుధవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధిగా ఉంటూ సమస్యలు పరిష్కరించడంలో చందర్‌గౌడ్ కీలక పాత్ర పోషించారన్నారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో కార్పొరేటర్లు సింగిరెడ్డి పద్మారెడ్డి, సుమన్ నాయక్, కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి, చీరాల నర్సింహ తదితరులున్నారు.

కరెంట్ మీటర్ల సర్వీసులకు ఫోన్ నంబర్ లింక్‌చేసుకోవాలి

బోడుప్పల్: విద్యుత్ వినియోగదారులు విద్యుత్ మీటర్ల సర్వీసులకు తమ యొక్క ఫోన్ నంబర్‌ను లింక్ చేసుకోవాలని బోడుప్పల్ ఏఈ మైలారం స్వామి వెల్లడించారు. బోడుప్పల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫోన్ నంబర్ లింక్ చేసుకోవడం వల్ల విద్యుత్ బిల్లుల సమాచారం మెసేజ్ ద్వార వస్తుందని, విద్యుత్ సమస్యలు వచ్చినప్పుడు పవర్ కట్ అయితే సమాచారం, బిల్లులు చెల్లింపుల వివరాలు మెసేజ్ రూపంలో వస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ తమ విద్యుత్ మీటర్లను ఫోన్ ద్వార లింక్ చేసుకోవాలని ఆయన కోరారు.

పీఏసీఎస్ ఉపాధ్యక్షుడిపై వీగిన అవిశ్వాసం



జిల్లా అధికారి శ్రీనివాసమూర్తి, సంఘం అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బుచ్చిరెడ్డి

కీసర: మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఉపాధ్యక్షుడు పన్నాల బుచ్చిరెడ్డిపై సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. సంఘంలోని సభ్యులు ఇటీవల ఉపాధ్యక్షుడు బుచ్చిరెడ్డిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. శుక్రవారం జిల్లా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధికారి శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఏడుగురు సభ్యుల కోరం అవసరం ఉండగా కేవలం అధ్యక్షుడు రామిడి ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బుచ్చిరెడ్డి ఇద్దరు మాత్రమే హాజరయ్యారు. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన సభ్యులు ఎవరూ హాజరుకాలేదు. దీంతో అవిశ్వాసం వీగిపోయిందని డీసీఓ తెలిపారు. సంఘం ఉపాధ్యక్షుడిగా బుచ్చిరెడ్డి యధావిధిగా కొనసాగుతారని ప్రకటించారు. తిరిగి ఉపాధ్యక్షుడిగా కొనసాగనున్న బుచ్చిరెడ్డిని మాజీ ఎంపీటీసీ రమేష్‌గుప్తా, జంగయ్యయాదవ్‌తో పాటు అభిమానులు ఘనంగా సత్కరించారు. జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ సీఎస్ రాజు, పద్మ సంఘం కార్యదర్శి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న మల్లారెడ్డి

- భూకబ్జాలు, అవినీతి కప్పిపుచ్చుకునేందుకే డ్రామాలు
- టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూరి వజ్రేష్ యాదవ్

సాక్షి, మేడ్చల్‌జిల్లా: భూకబ్జాలు, అవినీతి, అక్రమాల నుంచి తప్పించుకోవడానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిస్తే తప్పేముందని దిగజారుడు మాటలతో మేడ్చల్ నియోజకవర్గం ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ విమర్శించారు. వందలాది ఎకరాల ప్రభుత్వ భూములతో సహా పేదల భూములు ఆక్రమించుకొని విద్యాసంస్థలు, ఆస్పత్రులు నిర్మించిన ఎమ్మెల్యే మల్లారెడ్డి అవినీతికి అంతేలేదని ఆయన ఆరోపించారు. కాలేజీల్లో సరైన విద్యా ప్రమాణాలు పాటించకుండా ఎందరో విద్యార్థుల ఆత్మహత్యలు, మరణాలు కారకుడైన రియల్ ఎస్టేట్, విద్యా నేరస్తుడు మల్లారెడ్డి అని ఆయన విమర్శించారు. మేడ్చల్ ఎమ్మెల్యేగా ఉన్న మల్లారెడ్డి అల్లుడిని మల్కాజిగిరి ఎమ్మెల్యే చేశారన్నారు. ఇది సరిపోదన్నట్లు.. తన కుమారుడిని మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం నుంచి పోటీలో నిలబెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కల్వకుంట్ల కుటుంబం మాదిరిగా తన కుటుంబం కూడా రాజకీయాల్లో ఉండాలని ఆయన పగటి కలలు కంటున్నారని పేర్కొన్నారు. చైతన్యవంతమైన మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు మల్లారెడ్డి దిగజారుడు మాటలు నమ్మే స్థితిలో లేరని, ఆయనకు చావు దెబ్బ తప్పదని ఆయన హితవు పలికారు. ఎప్పటికైనా మల్లారెడ్డి, ఆయన కుటుంబం జైలుకు వెళ్లడం ఖాయమని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బాలుడి ఇంటికి వెళ్లి ఆర్థిక సాయం

ఘట్‌కేసర్: పట్టణంలోని మైసమ్మగుట్టకు చెందిన శేషు కుమారుడు ప్రదీప్ మూగ, చెవుడు సమస్యతో బాధపడుతున్నాడు. పుట్టుకతో వచ్చిన సమస్యకు ప్రదీప్ తల్లిదండ్రులు పడరాని కష్టాలు పడ్డారు. అప్పు చేసి ఆపరేషన్ చేయించగా దురదృష్టవశాత్తు అది ఫెయిల్ అయ్యింది. చికిత కోసం ఆస్పత్రిని సంప్రదించగా రూ.7 లక్షలు అవుతుందని తెలిపారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆపరేషన్‌కు అవసరమైన రూ.6 లక్షలు ఈఎస్‌ఐ ద్వారా అందజేశాడు. స్థానిక కౌన్సిలర్ ఆంజనేయులుగౌడ్ సమాచారం మేరకు శుక్రవారం కొర్రెముల్‌లో సభ ముగిసిన అనంతరం కేటీఆర్ బాలుడి ఇంటికి వెళ్లి పరామర్శించి రూ.లక్ష చెక్కు అందజేశాడు. ఈ సందర్భంగా సాయం చేసిన ఎమ్మెల్యే మల్లారెడ్డి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వినతి

బోడుప్పల్: రా చెరువు, అల్మాస్‌కుంట, సుద్దకుంట్ పరిసర ప్రాంతాల్లో చెత్త చెదారం వేస్తున్నారని, వేయకుండా ఉండే విధంగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతూ బోడుప్పల్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ప్రతినిధులు దొంతి పవన్‌కుమార్, దొంతి నవీన్ ముదిరాజ్‌లు కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. చెరువులు, కుంటల్లో చెత్తా, చెదారం వేయడం వల్ల జల కాలుష్యం ఏర్పడి చేపలు చనిపోతున్నాయన్నారు. కమిషనర్ స్పందించి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, డైమెన్షన్స్ మ్యాపులు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వారు కోరారు.

కాంగ్రెస్‌లోకి బీఆర్‌ఎస్ మాజీ కోఆప్షన్ మెంబర్

మల్లాపూర్: నాచారం చెందిన బీఆర్‌ఎస్ పార్టీ జీహెచ్‌ఎంసీ మాజీ కో ఆప్షన్ సభ్యురాలు, సెయింట్ పీటర్స్ స్కూల్ ఫౌండర్ విద్యాస్రవంతి కాంగ్రెస్ పార్టీ లో చేరారు. శుక్రవారం గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి దీప్‌దాస్ మున్షి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు వివి.రాజ్, రాజ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పక్కాగా లెక్క!

- జీఐఎస్ సాంకేతికతతో ఇళ్ల మ్యాపింగ్
- నగర శివారు 29 పురపాలికల్లో సర్వేకు సిద్ధం
- భవనాలు పన్ను పరిధిలోకి వచ్చేలా కసరత్తు
- సర్వేతో అన్నీ సునాయసంగా గుర్తింపు
- డిజిటల్ రికార్డుల నిర్వహణతో ఆదాయం పెంపు

సాక్షి, మేడ్చల్ జిల్లా: నగర శివారు పురపాలికల్లో జీఐఎస్(జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం) సాంకేతికతతో సర్వే చేపట్టేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఇళ్ల మ్యాపింగ్ చేయాలని నిర్ణయించిన కేంద్ర సర్కారు తాజాగా పురపాలికలకు సూచన చేసింది. తాజాగా చేపట్టే సర్వేతో భవన నిర్మాణాల సంఖ్య, అనుమతులకు అనుగుణంగా నిర్మించారా లేదా..? అనే విషయాలు తేటతెల్లమవుతాయి. డిజిటల్ రికార్డుల నిర్వహణతో పురపాలికలకు ఆదాయం పెరిగే అవకాశాలు కూడా ఉన్నాయి.

సులభంగా తెలుసుకునేలా..

నగరాలు పట్టణాల్లో వరద కాల్వలు, రహదారులు, తాగునీటి బోర్ల మార్గాల వ్యవస్థ అపార్టుమెంట్లు, ఉద్యానాలు, పచ్చదనం, వాణిజ్య సముదాయాలు ఇతర సమాచారం జీఐఎస్ సాంకేతికత సాయంతో గుర్తిస్తారు. నగరాలు, పట్టణాల్లో వివిధ డివిజన్లు/వార్డుల్లో ఇంటి నంబర్లు, ఆయా కాలనీలను గుర్తించేలా సర్వే నిర్వహిస్తారు. ప్రతి ఇంటిని సమీపంలో నుంచి చూసిన రీతిలో 3డీ పటాలు ఉంటాయి. ఆన్‌లైన్ క్లిక్ చేయగానే భవన నిర్మాణ రూపం కళ్ల ముందు కనిపించేలా మ్యాపింగ్‌లో పొందుపరుస్తారు. ఎంత మేర విస్తీర్ణంలో భవన నిర్మాణం ఉందో తెలుసుకునే వీలుంది.

పన్ను పరిధిలోకి వచ్చేలా..

నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లా పరిధిలోని 29 పురపాలక సంఘాల్లో ఏళ్ల నుంచి అనేక నిర్మాణాలు వెలుస్తున్నా.. ఆస్తి పన్ను ఎగవేస్తున్నారు. వ్యాపార, వాణిజ్య, పరిశ్రమలు, విద్యా సంస్థలకు సంబంధించి ఆస్తిపన్ను విషయంలో ఎగవేతలు అధికంగా ఉన్నట్లు ఆరోపణలు కూడా ఉన్నాయి. తాజాగా చేపట్టనున్న సర్వేతో పురపాలికల రికార్డుల్లో ప్రతి నిర్మాణాన్ని పొందుపరిచేలా అధికార యంత్రాంగం దృష్టి సారిస్తోంది. భవనాల స్వరూపంతో ఆయా ప్రాంతాల్లో గూగుల్ మ్యాప్ ద్వారా వివరాలను కేంద్ర, రాష్ట్రస్థాయిలో చేపట్టే చర్యలపై అప్పటికప్పుడు నివేదిక సిద్ధం చేసే అవకాశాలు ఉన్నాయి. వరద నీటి కాల్వలు, ఉద్యానాలు, రోడ్ల పరిధి, పారిశ్రామిక వాడలు ఏ విధంగా ఉండాలో నిర్ణయం తీసుకునే వీలుంది.

భువన్ సర్వే మాదిరిగానే..

గతంలో నిర్వహించిన భువన్ సర్వే మాదిరిగానే నగర శివారు పురపాలికల్లో సర్వే నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్న అధికార యంత్రాంగం సిబ్బందికి కూడా అవగాహన కల్పిస్తున్నట్లు తెలుస్తోంది. నిర్మాణాలు సజావుగా ఉండేలా, ప్రణాళికయుతంగా విధానాల రూపకల్పనకు జీఐఎస్ సాంకేతికతతో చేపట్టనున్న సర్వే ఎంతో వీలుగా ఉంటుందని పేర్కొంటున్నారు.

హామీలను అమలు చేశాం



మేడ్చల్ విజయోత్సవ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

ఘట్‌కేసర్: బీఆర్‌ఎస్ ఇచ్చిన హామీలను అమలు చేశామని, అధికారంలోకి వచ్చి రెండు నెలలు కావొస్తున్నా కాంగ్రెస్ హామీలను అమలు చేయడం లేదని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. కొర్రెముల్‌లో చెరుకు బాలయ్య గార్డెన్‌లో శుక్రవారం నిర్వహించిన మేడ్చల్ ఎమ్మెల్యే విజయోత్సవ సభలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియా కూటమి ఖాళీ అయ్యేది ఖాయమని, చివరికి రాహుల్ గాంధీ ఒక్కరే మిగులుతారన్నారు. బీఆర్‌ఎస్‌ను బొంద పెడతామంటున్న కాంగ్రెస్ నాయకులు ముందు తాము గెలిచిన సీట్లలో గెలవాలని, ప్రధాని మోదీ కాంగ్రెస్‌ను పాతాళానికి పంపుతారన్నారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలెవరూ అధైర్య పడొద్దని, బీఆర్‌ఎస్ అండగా ఉంటుందన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలోనే అభివృద్ధి: ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

బీఆర్‌ఎస్ పాలనలోనే అభివృద్ధి జరిగిందని, మల్కాజిగిరి ఎంపీగా గెలిచిన సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అభివృద్ధేమీ లేదన్నారు. ప్రజల సమస్యలను గాలికి వదిలేశారన్నారు. పార్లమెంట్‌లో స్థానిక ప్రజల సమస్యలను ప్రస్తావించేందుకు మల్కాజిగిరి ఎంపీగా బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలన్నారు.

ఐటీలో అగ్రగామిగా తెలంగాణ: బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత చామకూర భద్రారెడ్డి

సీఎం కేసీఆర్ తెలంగాణను ఐటీలో అగ్రగామిగా నిలిపారని, కరువు రాష్ట్రాన్ని అన్నపూర్ణగా తీర్చిదిద్దారన్నారు. మేడ్చల్ ఎమ్మెల్యే విజయోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పేదలకు సంక్షేమ పథకాలు అందించారని, సాగు, తాగునీటి ప్రాజెక్టులు నిర్మించాడన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు శంభీపూర్ రాజు, పీర్జాదిగూడ, బోడుప్పల్ మేయర్లు జక్కా వెంకట్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, ఘట్‌కేసర్ చైర్ పర్సన్ పావనీజంగయ్య, పోచారం చైర్మన్ కొండల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సంజీవరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రమేశ్, కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

జెడ్పీ వైస్ చైర్మన్ బెస్త వెంకటేష్



కొనసాగుతున్న కీసర మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కీసర: గ్రామ పంచాయతీల్లో పాలకవర్గం పదవీ కాలం ముగియడంతో ఇకపై ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులదే బాధ్యత అని, గ్రామాల్లో సమస్యల పరిష్కారం పట్ల నిర్లక్ష్యం వహించొద్దని జెడ్పీ వైస్ చైర్మన్ బెస్త వెంకటేష్ అన్నారు. శుక్రవారం మండల కార్యాలయంలో ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేకాధికారుల పాలనలో ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు.

- సమావేశానికి ఎంఈఓ శశిధర్‌తో పాటు పలు శాఖల అధికారులు హాజరుకాకపోవడం పట్ల ఎంపీటీసీ సభ్యులు సభలో ఎంపీపీ, ఎంపీడీఓ గ్యామనాయక్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఎంపీడీఓ సమావేశానికి హాజరుకాని అధికారుల పేర్లను జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. ఇకపై గ్రామాల్లో నీటి సరఫరా, నిర్వహణ బాధ్యత గ్రామ పంచాయతీలదేనని ఎంపీడీఓ సమావేశంలో తెలిపారు.
- వచ్చేది వేసవికాలం కావడంతో గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా, తాగునీటి ట్యాంకులను నెలలో మూడుసార్లు శుభ్రం చేసి తప్పనిసరిగా బ్లీచింగ్ ఫౌడర్‌తో క్లోరినేషన్ చేయాలన్నారు.
- గోధుమకుంట గ్రామంలో నాలా పూడ్చి వెంచర్ చేసినా ఎందుకు పట్టించుకోవడం లేదని వైస్ ఎంపీపీ జలాల్‌పురం సత్తిరెడ్డి ఇరిగేషన్ అధికారుల తీరుపై మండిపడ్డారు. ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలని భోగారం ఎంపీటీసీ సభ్యుడు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి తహసీల్దార్ అశోక్‌కుమార్‌ను కోరారు.
- కాళేశ్వరం పనుల్లో భాగంగా రోడ్లను ఇష్టానుసారంగా తవ్వుతున్నారని కీసర ఎంపీటీసీ సభ్యుడు తటాకం నారాయణ అన్నారు. భోగారం కళ్యాణం చెరువు లీకేజీ కారణంగా కిందున్న వరి పొలాలకు నష్టం కలుగుతుందని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని భోగారం ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి అధికారులకు వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ, విద్యుత్, వైద్యం, అటవీశాఖ తదితర శాఖలపై సమావేశంలో చర్చించారు. ఎంపీటీసీ సభ్యులు జూపల్లి వెంకటేష్, మంచాల కిరణ్‌జ్యోతిప్రవీణ్, ప్రమీల, వైద్యాధికారి డాక్టర్ సరితారెడ్డి, వ్యవసాయాధికారి మాధవిలత, ఎంపీఓ వినూత్నరెడ్డి వివిధ శాఖల అధికారులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

రోడ్డుపై పడి వ్యక్తి మృతి



కృష్ణ మృతదేహం

ఘట్‌కేసర్: పనికోసం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి రోడ్డుపై మృతి చెందిన ఘటన ఘట్‌కేసర్‌లో శుక్రవారం జరిగింది. సీఐ గోవర్ధనగిరి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అంబర్‌పేట్‌కు చెందిన డి.కృష్ణ(40) గురువారం రాత్రి పని కోసం ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. శుక్రవారం ఉదయం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో అనారోగ్యంతో రోడ్డుపై పడిపోయాడు. స్థానికులు 108 సిబ్బంది సాయంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన అక్కడ వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు. అతడి మృతిపై అనుమానం ఉందన్న భార్య ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కేసుగా నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.